సాక్షి
కామారెడ్డి

శనివారం । 23 । ఆగస్టు । 2025



హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు ఆందోళనలు చేశారు.

- 8లో ▸



నాణ్యతకు తిలోదకాలు

ఎల్లారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మించి పదేళ్లు కూడా గడవకముందే ఫ్లోరింగ్ దెబ్బతింది.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /21.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

భూసేకరణపై రైతులతో సబ్‌కలెక్టర్ చర్చలు



పిట్లం : బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం అన్నారం గ్రామంలో పర్యటించారు. నాగమడుగు ఎత్తిపోతల పథకంలో కెనాల్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. నాగమడుగులో కోల్పోతున్న భూముల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజనరేందర్ గౌడ్, ఆర్ఐ శీతల్, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'



కామారెడ్డి టౌన్ : సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ పెరుగు వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు, మూడు రోజుల పాటు తీవ్ర జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. డెంగీ, చికున్‌గున్యా, జ్వరం, మలేరియా, డయేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్ఎంవో యాదగిరి, హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు శివప్రసాద్, రాంసింగ్, కృష్ణ నాయక్, శిరీష, సంతోష్, భరద్వాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ అధ్యాపకుడికి ప్రశంసలు



భిక్కనూరు : వరంగల్‌లో మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ సైన్స్ సదస్సులో భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కెమిస్ట్రీ అధ్యాపకుడు నాగరాజు పాల్గొన్నారు. కెమికల్ సమ్మేళనాల తయారీ, అనువర్తనాలపై ప్రసంగించారు. ప్రసంగం అందరిని అలరించింది. శుక్రవారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాగరాజుకు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు మోహన్‌రావు, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాపరెడ్డి ప్రశంస పత్రం అందించారు. నాగరాజును తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అభినందించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కూలీలను సన్మానిస్తున్న కాసుల

బాన్సువాడ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి పనుల జాతర కార్యక్రమంలో భాగంగా బీర్కూర్ మండల కేంద్రంలో ఉపాధి కూలీలను సన్మానించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి నిధులు మంజూరు చేసి అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్యామల, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఖలేక్, బోయిని శంకర్, యామ రాములు, కాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా తిప్పలు

జిల్లాలోని పలు ప్రాంతాలలో యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎరువులకోసం సొసైటీలకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో కొరత లేదని అధికారులు చెబుతున్నా.. పంటలకు అవసరమైన సమయంలో యూరియా దొరక్కపోవడంతో ఆగమవుతున్నారు.

- ఎరువు కోసం సొసైటీలకు వరుస కడుతున్న రైతులు
- సరిపడా నిల్వలు లేక ఇబ్బందులు
- అవసరమున్న సమయంలో దొరకడం లేదని ఆవేదన



దోమకొండలో యూరియా కోసం రైతులు వరుసలో ఉంచిన చెప్పులు, ఆధార్‌కార్డు, ఇటుకలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎరువుల కొరత వేధిస్తోంది. చాలాచోట్ల రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం దోమకొండ, బీబీపేట మండలాల్లో పెద్ద సంఖ్యలో రైతులు ఎరువుల కోసం తరలివచ్చి వరుస కట్టారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సైతం ఈ సమస్య ఉంది.

వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 5.09 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 3,10,510 ఎకరాల్లో వరి పంట వేశారు. మక్క, సోయా, పత్తి పంటలు కూడా ఎక్కువ విస్తీర్ణంలోనే సాగయ్యాయి. జిల్లాలో సాగు చేసిన పంటలకోసం 52 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఈ విషయాన్ని అధికారులు గతంలోనే ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు జిల్లాకు 41 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరో 2,700 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. మరో ఐదారు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తే సరిపోతాయని చెబుతున్నారు. గతంలో మక్క పంటకు ఎకరానికి 3 బస్తాల నుంచి నాలుగు బస్తాల ఎరువులు వాడేవారని, ఇప్పుడు 6 బస్తాల నుంచి 8 బస్తాల వరకు వాడుతుండడంతో ఎరువుల అవసరం పెరిగిందని తెలుస్తోంది. బీబీపేట, దోమకొండ మండలాల్లో పెద్ద సంఖ్యలో రైతులు ఎరువు కోసం తరలిరావడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారులు ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు. అవసరానికి సరిపడా ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సదాశివనగర్, మాచారెడ్డి, భిక్కనూరు తదితర మండలాల్లోనూ యూరియా కొరత ఉంది. ఎరువుల లారీల లోడ్‌లు వచ్చింది వచ్చినట్టే ఖాళీ అయిపోతున్నాయి.

రోడ్డెక్కే పరిస్థితి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎరువుల సమస్యతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సహకార సంఘాల వద్ద భారీగా వరుస కడుతున్నారు. కొన్నిచోట్ల చెప్పులు వరుసల్లో ఉంచుతున్నారు. పంటలకు ఎరువులు వేయాల్సిన సమయంలో యూరియా దొరక్కపోవడంతో దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. అవసరమైన మేర ఎరువులను తీసుకువస్తే ఇబ్బందులు ఉండవని అంటున్నారు. జిల్లాకు అవసరమైన నిల్వలను తెప్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

గంటల తరబడి నిరీక్షణ



దోమకొండలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

దోమకొండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయానికి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయాన్నే కార్యాలయం వద్దకు చేరుకున్నారు. చెప్పులు, ఆధార్‌కార్డులు, రాళ్లను వరుసలో ఉంచి వెళ్లారు. యూరియా వచ్చిందని తెలుసుకున్న తర్వాత తిరిగి కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని వరుసలో ఉన్నారు. దీంతో వీరిని నియంత్రించడానికి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దీంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు ఎక్కువ సంఖ్యలో రావడం, యూరియా తక్కువగా ఉండడంతో అధికారులు ప్రతి రైతుకు ఆధార్‌కార్డు ఆధారంగా ఒక్కో బస్తాను అందజేశారు. సింగిల్‌విండో పరిధిలో 440 బస్తాలు రైతులకు పంపిణీ చేసినట్లు సొసైటీ కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు.



బీబీపేటలో క్యూలో వేచి ఉన్న రైతులు

ఎరువుల కోసం పాట్లు..

బీబీపేట: మండలంలోని వ్యవసాయ సహకార కేంద్రం వద్ద యూరియా కోసం శుక్రవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. కార్యాలయం తెరవక ముందే చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ ఆధార్ కార్డులు పట్టుకొని లైన్‌లో నిల్చున్నారు. యూరియా లారీ వచ్చిన వెంటనే జనం గుమిగూడడంతో పోలీసులు వచ్చి క్యూలో వేచి ఉండేలా చర్యలు తీసుకున్నారు. 405 బస్తాల యూరియా రావడంతో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.

'ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం'



సర్దాపూర్ తండాలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో పర్యటించి, పలు గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రూ. 1.24 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందన్నారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ నర్సింగారావు, పాల్వంచ, మాచారెడ్డి మండలాల పార్టీ అధ్యక్షులు పల్లె రమేశ్‌గౌడ్, నాసీలాల్ నాయక్, నాయకులు గణేశ్‌నాయక్, బ్రహ్మానందరెడ్డి, రాజు, సుతారి రమేశ్, ఇంద్రసేనారెడ్డి, స్వామి, నర్సింహారెడ్డి, రాజునాయక్, కొమురయ్య, లక్ష్మీరాజం, చంద్రనాయక్, దేవిసింగ్, రాము పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయండి

- లేకపోతే చర్యలు తప్పవు
- రైస్‌మిల్లర్లతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం : జిల్లాలోని రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన వరి ధాన్యం మిల్లింగ్‌ను త్వరగా పూర్తి చేసి బియ్యాన్ని ప్రభుత్వ గోదాములకు తరలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. లేదంటే మిల్లర్లపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్‌మిల్లర్లతో సీఎంఆర్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ 2024–25 సీజన్ ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం వచ్చే సెప్టెంబర్ 12 వరకు గడువు నిర్దేశించిందన్నారు. అధికారులు ప్రణాళిక తయారు చేసి గడువులోగా బియ్యం అప్పగించేలా చూడాలన్నారు. మిల్లర్ల నుంచి తీసుకునే బ్యాంక్ గ్యారంటీలను వారంలోగా జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం శ్రీకాంత్, లీడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకేరోజు 91 మందికి శిక్షలు

- డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్షలు, జరిమానాలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపినందుకుగాను జిల్లాలోని కోర్టులు ఒకే రోజు 91 మందికి జైలు శిక్షలు, జరిమానాలు విధించాయి. ఈ విషయాన్ని ఎస్పీ రాజేశ్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 మందికి ఒక రోజు జైలు శిక్ష, రూ. 1,100 జరిమానా విధించారని పేర్కొన్నారు. ఒకరికి 2 రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా, మరో 74 మందికి రూ. 1,100 చొప్పున జరిమానా విధించారని తెలిపారు. ఇందులో అత్యధికంగా ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 10 మందికి ఒకరోజు జైలు శిక్షతోపాటు రూ. 1,100 జరిమానా విధించారని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సదాశివనగర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం తిమ్మోజీవాడిలో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, నాడెపు కంపోస్ట్ షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి ఐకేపీ ద్వారా కూడా రుణాలు ఇప్పిస్తామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలపై సమీక్షించారు. అంతకుముందు గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, ఏఎంసీ డైరెక్టర్ అశోక్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పొన్న సాయిలు, నాయకులు నందిపేట సాయిలు, పొన్న నర్సయ్య, కిషన్‌రావు, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింలు పాల్గొన్నారు.

ఆహ్లాదం అందని ద్రాక్షే?

- కలగానే కామారెడ్డి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్
- పట్టించుకునేవారు లేక ధ్వంసమైన లైటింగ్ వ్యవస్థ, వాకింగ్ టైల్స్, రెయిలింగ్
- కళావిహీనంగా మారిన చెరువు కట్ట
- అభివృద్ధి చేయాలని కోరుతున్న పట్టణవాసులు



అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టణవాసులకు ఆహ్లాదం కరువవుతోంది. పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడం కోసం తొమ్మిదేళ్ల క్రితం ప్రభుత్వం మిషన్ కాకతీయ ఫేజ్– 2లో రూ. 8.96 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టారు. పుడిక తీసి, సరంపల్లి నుంచి గంగమ్మ చెరువు వరకు ఉన్న కట్టపై ఇరువైపులా మరమ్మతులు చేపట్టి, రోడ్డు వేయించారు. చెరువు వైపు సరంపల్లి నుంచి అలుగు వరకు వాకింగ్ ట్రాక్ కోసం టైల్స్ వేసి, లైటింగ్, స్టీల్ రేయిలింగ్ పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత పట్టించుకునేవారు లేకపోవడంతో రోడ్డుపై పిచ్చిమొక్కలు పెరిగాయి. వాకింగ్ ట్రాక్ ధ్వంసమయ్యింది. లైటింగ్ వ్యవస్థ పనిచేయడం లేదు. రోడ్డు బాగా లేకపోవడంతో చెరువు అందాలను వీక్షించడానికి ఎవరూ రావడం లేదు. దీంతో ఈ ప్రాంతం ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. పాలకులు స్పందించి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.



వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు



అడవిలా మారిన చెరువు కట్ట, పనిచేయని లైటింగ్ వ్యవస్థ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 11వ జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈనెల 30, 31 తేదీల్లో పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల ఇన్‌చార్జి అధికారి రంగా వెంకటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

ఎంపికైంది వీరే..

ఓంకార్, సిద్ధు, సంజీవ్, శ్రీవల్లిక, ముత్యపు తేజ, రంజిత్, ఆకాష్, చరణ్, యోగి, సాంకేత్, ఆనంద్, దినేష్, అర్చన, దరియాసింగ్, పరమేశ్, వెంకటేష్, శివకుమార్, అఖిల, నందిని, మాధవి, అనిత, నవ్యశ్రీ, అనిల్‌కుమార్, ఈశ్వర్‌ప్రసాద్, ఎం.అఖిల, వైష్ణవి, అమృత, కౌశిక్, ఈశ్వర్, సిరి.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

క్లుప్తంగా

నేడు ఎల్లారెడ్డికి మందకృష్ణ మాదిగ రాక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణానికి శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీయస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలోని బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించతలపెట్టిన వికలాంగుల, వృద్ధులు, వితంతు, చేయూత పింఛన్‌దారులతో నిర్వహించే సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు వారు చెప్పారు. పింఛన్‌దారులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ఆత్మకూర్ విద్యార్థిని ప్రతిభ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డిలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి 11వ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం. శ్వేత ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పీఈటీ సంతోష్ తెలిపారు. జిల్లాస్థాయిలో రెండోస్థానంలో నిలిచిన శ్వేతను పాఠశాల హెచ్‌ఎం ఎండీ. జబీన్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో గణేశ్ ఉత్సవాలపై వివిధ ప్రభుత్వ శాఖలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలవాలని, ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజారెడ్డి, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఎస్సై బొజ్జ మహేష్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, అగ్నిమాపక అధికారి వినోద్, డీఎల్‌పీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపేటలో తహసీల్దార్ సురేశ్‌కు వినతి పత్రం



తాడ్వాయిలో తహసీల్దార్ శ్వేతకు..



బీబీపేటలో తహసీల్దార్ గంగాసాగర్‌కు..

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



రాజంపేటలో తహసీల్దార్ జానకికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు



కామారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా తహసీల్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 నగదు, రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ.15వేలు, యువ వికాసం పథకం కింద నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగభృతి అందజేయాలని డిమాండ్ చేశారు. వారసత్వం ద్వారా వచ్చే భూములను రిజిస్ట్రేషన్ చేయాలని, అర్హులైన వారికి ఫ్యామిలీ సర్టిఫికెట్లను ఇప్పించాలని కోరారు. అదే విధంగా రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను ప్రతి సొసైటీలో అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



సదాశివనగర్ తహసీల్దార్ సత్యనారాయణకు..



దోమకొండలో..



పాల్వంచలో తహసీల్దార్‌కు..

సంక్షిప్తం

నేడు సీపీఎస్ ఉద్యోగులు బ్లాక్ డేగా జరుపుకోవాలి

కామారెడ్డి టౌన్: సీపీఎస్ ఉద్యోగులు శనివారం బ్లాక్‌డేగా జరుపుకోవాలని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2014 ఆగష్టు 23న జీవో–28 ద్వారా సీపీఎస్ అమలు చేసి ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ప్రతి సీపీఎస్ ఉద్యోగి నల్లబ్యాడ్జీలను ధరించి భోజన విరామ సమయంలో నిరసనలు తెలపాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా విఠల్ రాథోడ్

కామారెడ్డి టౌన్: ఆలిండియా బంజారా సేవా యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి తండాకు చెందిన కేతావత్ విఠల్ రాథోడ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్ ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు తనను నియమించినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. విఠల్‌ను నాయకులు సన్మానించారు. నేతలు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బల్దియా వంద రోజుల కార్యక్రమం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో బల్దియా ఆధ్వర్యంలో చేపడుతున్న 100 రోజుల కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయా వార్డుల్లో ప్రత్యేకంగా సానిటేషన్ కార్యక్రమాలతో పాటు డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు. కుండీలు, మొక్కల తొట్టీలలో నిల్వ ఉన్న నీటిని కార్మికులు తొలగించారు. దోమల నివారణ కోసం గుంతలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ ప్రచారం చేశారు.

వ్యవసాయ యాంత్రీకరణ దరఖాస్తుల స్వీకరణ

బాన్సువాడ రూరల్: తెలంగాణ ప్రభుత్వం పునఃప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. రైతులు తమకు కావాల్సిన యంత్ర పరికరాల కోసం రైతువేదికల్లో అందుబాటులో ఉండే క్లస్టర్ ఏఈవోలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. శుక్రవారం దేశాయిపేట్ రైతువేదికలో ఏఈవో దత్తేశ్వరి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 160 బ్యాటరీ పంపులు, 24 తైవాన్ పంపులు, 10 రోటవేటర్లు, 2సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్, 11 కల్టివేటర్లు, రోటో పడ్లర్, కేజీవీల్స్, 12 గడ్డి కట్టలు కట్టే యంత్రం తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్, ఫొటోలతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని బోర్లం క్లస్టర్ ఏఈవో రాణి తెలిపారు.

29న మండలస్థాయి టీఎల్‌ఎం మేళా

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో ఈ నెల 29న మండలస్థాయి టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాను నిర్వహించనున్నట్లు స్థానిక ఎంఈవో భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతోపాటు ఇతర ఉపాధ్యాయులు మేళాలో ప్రదర్శించే స్టాళ్లను రూపొందించుకొని కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

పోచారంలోకి తగ్గిన వరద

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద శుక్రవారం తగ్గుముఖం పట్టింది. గురువారం సాయంత్రం వరకు 2,693 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. శుక్రవారం నాటికి 1,192 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రధానకాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా మరో 1,142 క్యూసెక్కుల నీరు అలుగుపై నుంచి పారుతోంది.

ఘనంగా పొలాల అమావాస్య



మద్నూర్‌లో హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లను తిప్పుతున్న రైతులు



పెద్దకొడపగల్‌లో..



మద్నూర్‌లో రైతు వేషధారణలో బాలుడు

మద్నూర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): మద్నూర్, పెద్దకొడప్ మండలాల పరిధిలో శుక్రవారం పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎద్దులను అందంగా అలంకరించారు. పండుగ సందర్భంగా ఎడ్లతో ఎలాంటి పనులు చేయించకుండా వాటికి ఇష్టమైన పండ్లు, పోలేలు, ప్రత్యేకమైన వంటకాలను వండి తినిపించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నస్రుల్లాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మాధవరావు, డిప్యూటీ వార్డెన్ రాధ, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన యూత్ సభ్యులు మనోజ్ యాదవ్, కమ్మరి లక్ష్మీనారాయణ, వడ్ల శ్రీనివాస్, మార్గం రాజు, బాబు, భాను, సాయిలు, మహేందర్, నవీన్, రవి, తదితరులు లింగంపేట సొసైటీ వైస్‌చైర్మన్ మాకం రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే స్వాగతం పలికారు.

తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం

ఘనంగా ఇలియాస్ జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న యువకులు, కార్యకర్తలు



షబ్బీర్ అలీకి కేక్ తినిపిస్తున్న కుమారుడు ఇలియాస్

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కుమారుడు మహమ్మద్ ఇలియాస్ జన్మదినం సందర్భంగా తలసేమియా బాధితుల సహాయార్థం శుక్రవారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు, కార్యకర్తలు 105 మంది రక్తదానం చేశారు. ఈ మేరకు రక్తదాతలను షబ్బీర్ అలీ, ఇలియాస్‌ను అభినందించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, రక్తదాతల సమూహం నిర్వాహకుడు బాలు, నర్సింగ్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

చేపల విత్తనాల బదులు నగదు జమచేయాలి

బాన్సువాడ రూరల్: టెండర్లు పెట్టి చేప విత్తనాలు సరఫరా చేసే బదులు, ప్రభుత్వం విత్తనాల కొనుగోలు కోసం మత్స్యకార సొసైటీ అకౌంట్లోనే నగదు జమ చేయాలని మత్స్యకార్మిక సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుర్కి గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మత్స్య కార్మికుల సమస్యలపై చర్చించారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురికాకుండా చూడాలన్నారు. 50 మంది సభ్యులున్న సొసైటీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రతి సొసైటీకి రూ.10 లక్షల రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు పందిరి రాజేష్, ప్రధాన కార్యదర్శి మధు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు పీజీ హెచ్‌ఎంలుగా 28 మంది రాక

కామారెడ్డి టౌన్: విద్యాశాఖలో చేపడుతున్న పదోన్నతుల ప్రక్రియలో భాగంగా జిల్లాకు 28 మంది పీజీ హెచ్‌ఎంలు రానున్నారు. శుక్రవారం ఆర్‌జేడీ వరంగల్‌లో స్కూల్ అసిస్టెంట్‌లకు పీహెచ్‌ఎంగా పదోన్నత్తుల ప్రక్రియ కొనసాగింది. స్థానిక సంస్థల స్కూల్‌లకు 24 మంది, ప్రభుత్వ సంస్థలకు నలుగురు పీజీహెచ్‌ఎంగా వస్తున్నారు. దీంట్లో కామారెడ్డి జిల్లాకు చెందిన వారు 19 మంది ఉపాధ్యాయులు ఉండగా ఆయా జిల్లాకు చెందిన వారు 9 మంది ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించండి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఉన్న అతి పురాతమైన హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు, భక్తులు, గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం హనుమాన్ ఆలయం వద్ద వారు మాట్లాడారు. ఆలయ స్లాబ్ ఊరుస్తుండడంతో.. ఆలయ మరమ్మతు పనులు మొదలు పెట్టామన్నారు. మద్నూర్‌లో జరిగే పెళ్లి వేడుకలో నూతన వధువరులు మొదట ఈ ఆలయం వద్దనే బంధువుల ఎదుర్కోల కోసం వేచి ఉంటారని అన్నారు. ఇంతటి ప్రాచుర్యం పొందిన ఆలయ పునర్నిర్మాణం కోసం ఈ ప్రాంతానికి చెందిన మనసున్న మనుషులు ముందుకు వచ్చి సహాయం చేస్తే నిర్మాణం పూర్తి జరుగుతుందని అన్నారు.

వాసవీ మాత ఆలయంలో కుంకుమ పూజలు



భిక్కనూరు: మండల కేంద్రంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఇటీవల ప్రతిష్ఠించిన వాసవీ మాత ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలతో పాటు ఇతర పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం సభ్యులు పబ్బ నాగరాజు, కోడిప్యాక అంజనేయులు, పబ్బ జగన్నాథం, పురాం రాజమౌళి, శనిశెట్టి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ముగ్గురు పట్టుబడ్డారు. వారిని మండల పరిధిలోని పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన కాట్రోత్ రమేష్, పేట్‌సంగెం గ్రామానికి చెందిన కుమ్మరి సాయిలు, కాటెవాడి తండాకు చెందిన బానోత్ గణేష్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం శుక్రవారం ముగ్గురిని ఎల్లారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి వారికి రూ. 1100 చొప్పున జరిమానా, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనం నడుపుతూ ఒకరు పట్టుబడ్డారు. మండలంలోని వాడి గ్రామానికి చెందిన పుల్కంపేట అంజయ్య మద్యం తాగి వాహనం నడుపుతుండగా పట్టుకున్నట్లు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి తండాలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో తండాలోని పేకాట స్థావరంపై గురువారం అర్ధరాత్రి ఎస్సై అరుణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి, పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.2450 నగదు, 6 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 8830 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని స్నేహపురి కాలనీలో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో శుక్రవారం చోరీ జరిగింది. పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాలు ఇలా.. స్నేహపురి కాలనీలోని ఒకటో నంబర్ వీధిలో రెండు ఇళ్లలో, 9వ నంబర్ వీధిలో మరో ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం స్థానికులు చోరీని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు ఇళ్లలో కలిపి రెండు తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 50వేల వరకు నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

క్రైం కార్నర్

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ (32) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శుక్రవారం వేకువజామున అతడు బయటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. జంగంపల్లి చెరువు సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బస్టాండ్ క్యాంటీన్‌లో కూలిన పైకప్పు



బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో ఉన్న క్యాంటీన్ పైకప్పు శుక్రవారం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో క్యాంటీన్‌లో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్టాండ్ పురాతన భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు తడిసిపోయి కూలింది. పైకప్పు కూలిన శబ్దానికి ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. క్యాంటీన్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా దెబ్బతింది. ఆర్టీసీ అధికారులు శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌కు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాఠశాలకు నోటీసులు జారీ

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు ఎంఈవో రాజ గంగారాం శుక్రవారం నోటీసులు జారీ చేశారు. టీసీల కోసం వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తుండటంతో నోటీసులు ఇచ్చినట్లు ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజుల విషయంలో గాని టీసీల విషయలో విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే పాఠశాల యాజమాన్యాలపై శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఒకరిపై కోతులు దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ గంగాగౌడ్ శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లివస్తుండగా వస్తుండగా పాఠశాల సమీపంలో కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి భూపల్లి ప్రదీప్, స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యుడు సాయిబాబా, ఏఎస్‌ఎం లక్ష్మి, ఆయనకు ఆరోగ్య సలహాలు అందించారు. కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ తదితరులు ఆయనను పరామర్శించారు.

మూడేళ్లకు దొరికిన బైక్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): హైదరాబాద్‌లో 2022లో పోయిన బైక్, మూడేళ్ల తర్వాత మండలంలో దొరికింది. ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా, ఓ బైక్‌పై నాన్‌కాంటాక్ట్ చలాన్ వేశారు. దీంతో ఆ బైక్‌పై కేసు ఉన్నట్లు తెలిసింది. వెంటనే పోలీస్ సిబ్బంది ఆ బైక్‌ను వెతికి పట్టుకొని హైదరాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఎస్సై అరుణ్ కుమార్‌ను అభినందించారు.

మూడొందల మందికి ఒకే టాయిలెట్

- బిచ్కుంద బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్లు లేక అవస్థలు
- గతంలో నిధులు మంజూరైనా నిర్మించకపోవడంతో వెనక్కిపోయిన నిధులు
- మున్సిపాలిటీ పరిధిలో నిలిచిన ఈజీఎస్ నిధులు



టాయిలెట్ వద్ద క్యూలో నిల్చున్న విద్యార్థినులు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటుకు ధీటుగా అన్ని రంగాల్లో తీర్చిదిద్ది అన్ని వసతులు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. హైస్కూల్‌లో 250 మంది విద్యార్థులు, ప్రైమరీలో 50 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి ఉంది. హైస్కూల్ టాయిలెట్స్ పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి.. వాడడం లేదు. ప్రైమరీ పాఠశాలకు ఉన్న ఒకే మరుగుదొడ్డిని రెండు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు వాడుతున్నారు. తరగతులు వదిలి టాయిలెట్ వద్ద క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొందరు విద్యార్థులు టాయిలెట్స్ కోసం ఇంటికి వెళ్తున్నారు. ఇన్ని ఇబ్బందులున్నా అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనర్హం. నిర్మించడానికి రేపు మాపు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు.

వచ్చిన నిధులు వెనక్కి..

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మరుగు దొడ్ల నిర్మాణం కోసం 2023లో అలాగే 2025లో హైస్కూల్‌కు రూ.12 లక్షలు, ప్రైమరీ పాఠశాలకు రూ.4 లక్షల నిధులు రెండు సార్లు మంజూరయ్యాయి. అధికారుల అలసత్వంతో ఏళ్లు గడుస్తున్నా మరుగుదొడ్లు నిర్మించలేదు. బిచ్కుంద జీపీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ఆగిపోయాయి. మున్సిపాలిటీ పరిధిలో ఈజీఎస్ పనులు చేయకపోవడంతో మరుగు దొడ్లకు మంజూరైన రూ.లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. జీపీగా ఉన్నప్పుడు మంజూరైన పనులు చేయకుండా అధికారుల నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా టాయిలెట్లు నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.. అయినా ఎలాంటి ఫలితం దక్కలేదు. తూతూమంత్రంగా ఒక టాయిలెట్‌కు మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి కనీసం నాలుగు మరుగుదొడ్లు కట్టించాలని విద్యార్థులు కోరుతున్నారు.

బాధలు వినేవారు లేరు



పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. మా బాధలు ఎవరికీ కనబడటం లేదు. వందల మంది విద్యార్థులకు ఒకటే మరుగుదొడ్డి ఉంది. కనీసం నాలుగైదు కట్టించాలని కోరుతున్నాం.

– సంధ్య, 7వ తరగతి విద్యార్థిని, బిచ్కుంద

క్యూలో నిలబడుతున్నాం



టాయిలెట్స్ కోసం చదువులు వదిలి గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా అసహ్యంగా ఉంది. ఆపుకుంటే కడుపు ఉబ్బి నొప్పి వస్తుంది. కలెక్టర్ సారు స్పందించి కట్టించాలని కోరుతున్నాం.

–దీపాలి, 7వ తరగతి విద్యార్థిని, బిచ్కుంద